ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

◆ విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున ◆ వివిధ శాఖాధికారులతో ఏర్పాట్లుపై సమీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తుపానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి సిద్ధంగా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. తుపానుపై రాష్ట్ర ప్రభుత్వ రియల్ టైమ్ గవర్నెన్స్ చేసిన హెచ్చరికను అనుసరించి శనివారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో వెబెక్స్ ద్వారా జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మతో కలిసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

4, 5 తేదీల్లో మిచాంగ్ తుపాను మూలంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో అధిక వేగంతో గాలులు వీచే అవకాశముందని, ఈ మేరకు తీర ప్రాంత మండలాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుపాను హెచ్చరిక మూలంగా అధికారులెవరికీ సెలవులు మంజూరు చేయబడవని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. జివిఎంసి పరిధిలో గత అనుభవాలు దృష్ట్యా ముంపు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల ప్రజలను ముందుగా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరుకైన నీటి ప్రవాహ కాలువలను ముందుగా గుర్తించి చెత్తను తొలగించాలని పేర్కొన్నారు. తుపాను తరువాత వెను వెంటనే ముంపు నీటిని తొలగించేందుకు అన్ని ఏర్పాట్లూ ముందుగా చేసుకోవాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు గ్రామాల్లో తాగునీటి సరఫరా చేయాలని, అందుకు పంపింగ్ స్టేషన్లలో డీజిల్ జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సంబంధిత ఎస్ఇని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్స్ రిపేర్స్ వస్తే అందుకు అనుగుణంగా ఇన్వెంటరీ లెవెల్ మిగతా 2లో..

కంట్రోల్ రూములు ఏర్పాటు

జిల్లా కలెక్టరేట్, జివిఎంసి కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం 0891-2590102, 0891-2590100 నెంబర్లలో, జివిఎంసి కంట్రోల్ రూం 180042500009, 0891-2869106 ఫోన్ నెంబర్లలో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తుపాను తీర ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని 54 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. ఈస్ట్ కోస్ట్ కేంద్రంగా సేవలందిస్తున్న 12 రైళ్లు, ప్యాసింజర్ సేవలందిస్తున్న 42 రైళ్లు వీటిలో ఉన్నాయి. వీటి రద్దు వివరాలను రైల్వే వెబ్‌సైట్లలో ఉంచారు.

గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు కె.లోకనాథం, గనిశెట్టి సత్యనారాయణ

వాడచీపురుపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా

◆ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కుటుంబీకులే నిందితులు
◆ మట్టిని తవ్వి చేపల చెరువులకు తరలింపు
◆ అధికారులు చోద్యం చూడటం దారుణం
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం విమర్శ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి తూర్పు ఖండం రెవెన్యూలో సర్వే నెంబరు 297లోని 11.97 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, అది బడా బాబుల గుప్పిట్లోకి, ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల చేతిలోకి వెళ్లిపోయిందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సుమారు రూ.6 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించి అందులోని మట్టిని సమీపంలోని చేపల చెరువులకు తరలించేశారని తెలిపారు. వాడచీపురుపల్లి తూర్పు ఖండంలో మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ 'చేపల చెరువుల మాదిరిగా ఇక్కడ భూములను మార్పు చేస్తున్నారు. అందుకే పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ తండ్రికి చేపల చెరువులు ఉన్నాయి. వాటిని ఆనుకొని ఈ ప్రభుత్వ భూమి ఉంది. దీంతో ఆ మిగతా 2లో..

17న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

▶ వార్త 5లో..

జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలి

▶ వార్త 5లో..

నిధులు మళ్లిస్తే పంచాయతీల అభివృద్ధి ఎలా?

▶ వార్త 3లో..

షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సినీ హీరో వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ సందడి

ఘనంగా ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన జగదాంబ జంక్షన్‌లో మరో భారీ వస్త్ర ప్రపంచం ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ శనివారం ప్రారంభమైంది. సినీ హీరో వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఆయన్ను చూసేందుకు అభిమానులు తండోపతండాలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ మాట్లాడుతూ ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ తన 14వ షోరూంను విశాఖలో ప్రారంభించడం హర్షించదగిన విషయమన్నారు. అన్ని మిగతా 2లో..

ప్రజల నిరసనతో ఆగిన మద్యం దుకాణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనావాసాల నడుమ మద్యం దుకాణం వద్దంటూ స్థానికులు ఆందోళన చేయడంతో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాన్ని ఆపి వేయించారు. వివరాల్లోకి వెళితే.. జివిఎంసి 32వ వార్డు అల్లిపురం నేరెళ్ల కోనేరు జంక్షన్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆ దుకాణ ప్రారంభానికి ప్రయత్నాలు జరిగాయి. ఇది తెలిసిన స్థానికులు జనసేన, టిడిపి, సిపిఐ, సిపిఎం, వైసిపి నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. శనివారం ఉదయం కూడా నిరసనలు చేపట్టడంతో ఎక్సైజ్ అధికారులు స్పందించారు. దుకాణం ఇక్కడి నుంచి తొలగించాలని నిర్ణయించి మద్యం స్టాకును ఆ దుకాణం నుంచి తరలించారు. తాజా నిర్ణయంపై స్థానిక ప్రజలతో పాటు పలు పార్టీల రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజా విజయమని, మరోసారి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

మణిపాల్ టైగర్స్ విజయం

విశాఖలో సందడిగా ప్రారంభమైన లెజెండ్ టి 20 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం) ఉత్సాహభరితంగా, ఉత్కంఠ భరితంగా సాగిన ఇండియన్ క్యాపిటల్స్ - మణిపాల్ టైగర్స్ టి 20 మ్యాచ్‌లో 4 వికెట్లు మిగిలి ఉండగానే హర్భజన్ సింగ్ సేన మణిపాల్ టెగర్స్ విజయం అందుకుంది. లెజెండ్స్ క్రికెట్ లీగ్ టి-20 తొలి మ్యాచ్ విశాఖలోని పిఎం.పాలెం సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం జరిగింది. సాయంత్రం ఆరంభమైన ఈ మ్యాచ్‌కు విశాఖ వాసులు తరలివచ్చారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియన్ క్యాపిటల్స్ 20 ఒవర్లలో 9 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ గౌతమ్ గంభీర్ 8 బంతుల్లో 17 పరుగులు, రికార్డో పావెల్ 11 బంతుల్లో 14 పరుగులు చేసి అవుటయ్యారు. మూడో స్థానంలో దిగిన భరత్ చిప్పిలి 51 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 65 పరుగులు చేసి రాణించాడు. మిడిల్ ఆర్డర్‌లో దిగిన బెన్‌డంక్ 33 పరుగులు, ఆష్లేయ్ నర్స్ 26 పరుగులు చేశారు. మణిపాల్ టైగర్స్‌లో పంకజ్ సింగ్ 2, ప్రవీణ్ గుప్తా 2, హర్భజన్ సింగ్ 1, ఇమ్రాన్ ఖాన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మణిపాల్ టైగర్స్ జట్టులోని గ్రాండ్ హోమి 35 మిగతా 2లో..

గెలుపు ఆనందంలో మణిపాల్ టైగర్స్ జట్టు సభ్యులు

మొదటి పేజీ తరువాయి..

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

ట్రాన్స్‌ఫార్మర్స్ సిద్ధం చేయాలని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇని కోరారు. టెలికం ఆపరేటర్లు మొబైల్ సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా జనరేటర్స్ వంటి సదుపాయాలు ముందుగా ఏర్పాటు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. పౌరసరఫరాల శాఖాధికారులను రేషన్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ జెడి రైతులకు తుపాను సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. కెజిహెచ్, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విశాఖ పట్టణ పరిధిలో 25, గ్రామీణ ప్రాంతంలో 20 తుపాను రక్షిత కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. వీటిలో సుమారు 50 వేల మందికి వసతి కల్పించవచ్చన్నారు. ఈ కేంద్రాలలో భోజన ఏర్పాట్లు, లైటింగ్ సదుపాయం, మెడికల్ కిట్లు, దుప్పట్లు, మంచినీరు వంటి సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని జివిఎంసి జోనల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ, జివిఎంసి, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయత్ రాజ్, జెడ్‌పి సిఇఒ, రోడ్లు, భవనాల శాఖ, వైద్య శాఖ, ఎపిఇపిడిసిఎల్, సమాచార శాఖల అధికారులు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

వాడచీపురుపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా

విలువైన భూమిపై కళ్లు పడ్డాయి. కొడుకు ఎమ్మెల్యే కావడం, పైగా పార్టీ కూడా అధికారంలో ఉండటంతో ఎదురే లేకపోవడంతో అక్రమాలకు దిగారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను తమ గుప్పెట్లో పెట్టేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూడటం దారుణం' అని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కుల నుంచి ఈ ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. రాత్రి సమయంలో మట్టిని తరలించి వందలాది లారీలతో భూముల లెవెలింగ్ పనులు చేస్తున్న వారి పట్ల ఏమీ పట్టనట్టు ఉండటం అధికార యంత్రాంగానికి తగదన్నారు. ఓ శాసనసభ్యుడు ఈ రకంగా అవినీతికి పాల్పడటం, భూ కబ్జాలకు, గ్రావెల్ మాఫియాకు వంత పాడటం దారుణమన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేస్తామన్నారు.

వరుణ్ తేజ్ సందడి

తరగతుల ప్రజలు వారి వారి అభిరుచులకు అనుగుణంగా విశాఖ ఆర్ఎస్ బ్రదర్స్‌లో వైవిధ్యభరిత వస్త్ర శ్రేణితో మంచి అనుభూతిని పొందుతారన్నారు. సామాన్యులు కూడా అందుబాటు అయిన ధరలో తమకు కావలసిన వస్త్రాలను ఇక్కడ కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం తరఫున బి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో కుటుంబ సభ్యులంతా వెరైటీ వస్త్రాల కొనుగోలు కోసం ఆర్ఎస్ బ్రదర్స్‌కు రావాలని వారు ఆహ్వానించారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు.

మణిపాల్ టైగర్స్ విజయం

బంతుల్లో మూడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 58 పరుగులు చేసి రాణించాడు. అమిత్ 32 బంతుల్లో మూడు సిక్స్‌లు, మూడు ఫోర్లతో 48 పరుగులు చేశాడు. వీరిద్దరూ రాణించడంతో ఆ జట్టు విజయం సాధించింది.

ముగ్ధ షోరూంపై కేసు నమోదు చేయాలని భిక్షాటన

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మృతుని కుటుంబీకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమిళనాడులోని కాంచీపురంలో ఉన్న ముగ్ధ షోరూంలో క్యాషియర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ మృతికి కారకులైన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని, మృతుని కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కోర్టుకు ఎదురుగా ఉన్న ముగ్ధ షోరూం వద్ద భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ ముగ్ధ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. విశాఖపట్నంకు చెందిన మురళీకృష్ణ కాంచీపురంలోని ముగ్ధ షోరూంలో క్యాషియర్ ఉద్యోగం చేసేవాడని, ఏప్రిల్ 10న అక్కడ ఆకస్మికంగా మరణించాడని తెలిపారు. ఈ మృతిపై అనేక సందేహాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై విశాఖపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం కనిపించలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, నాయకులు ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయం చేయమంటే.. అరెస్టులు

భిక్షాటన కార్యక్రమం జరుగుతున్న విషయం తెలియడంతో పోలీసులు అక్కడకు చేరి, ఆందోళనను విరమించాలని కోరారు. కుటుంబానికి న్యాయం చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని సిఐటియు నగర కార్యదర్శి ఎం.సుబ్బారావు స్పష్టం చేశారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు బలవంతంగా సుబ్బారావును, మృతుడు మురళీకృష్ణ భార్య, అతని ఆరేళ్ల కుమార్తెను అరెస్ట్ చేసి వ్యాన్‌లో టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరుపై పలువురు మండిపడ్డారు.

అరెస్టును ఖండించిన సిఐటియు

సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావును పోలీసులు అరెస్ట్ చేయడాన్ని సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. పోలీసులు నిర్బంధం ప్రయోగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

రాజకీయ కాక..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'సమాజాన్ని సజీవంగా నిలుపుతున్నవి రాజకీయాలే' అన్నదాంట్లో నిజం లేకపోలేదు. ఎవరేం మాట్లాడినా, కదలాడినా అందులో ఏదో మూలన రాజకీయం దాగి ఉంటుంది. పక్క రాష్ట్రంలో జరిగిన పోలింగ్‌తో ఎపిలోని అన్ని పార్టీల్లోనూ రాజకీయ సెగలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విశాఖ నగరంలో అధికార పార్టీ రాజకీయాలు, ప్రతిపక్షాల కదలికలు చూస్తుంటే 2024 ఎన్నికల సన్నద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. జగనన్నకు చెబుదాం అంటూ వైసిపి, బాబూ ష్యూరిటీ అంటూ ప్రతిపక్ష తెలుగుదేశం పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. లోకేష్ యువగళం యాత్రపైనా టిడిపి దృష్టిపెట్టింది. రుషికొండపై జరుగుతున్న నిర్మాణాల్లో రూ.వందల కోట్లు ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందంటూ జగన్‌పై ఆరోపణల వేగం పెంచారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రభావం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పైనా పడనుందన్న చర్చ శరవేగంగా సాగుతోంది. పక్క రాష్ట్ర ఎన్నికలు ఎపిలోనూ ముఖ్యంగా విశాఖపట్నం, ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ 'రాజకీయ కాక' పెంచాయి. విశాఖను ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా చేసుకుని పాలనకు సిద్ధం అవుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపైనా ఈ ప్రభావం పడింది. ప్రజల్లోనూ, రాజకీయ నాయకుల్లోనూ సాగుతున్న తాజా చర్చ చూస్తే అక్కడ కాంగ్రెస్ కూటమి గెలిస్తే ఇక్కడ 2024 ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదు అన్న రీతిలో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీపై తెలంగాణలో కనిపించిన వ్యతిరేకత ఎపిలోనూ ఇప్పటికే కనిపిస్తున్న అసంతృప్తులూ వెరసి వైసిపి వ్యతిరేక ఓటు పెరగడానికి దోహదం చేస్తుందన్న చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా నేడు తెలంగాణ ఫలితాలు రానుండడంతో రాజకీయ పార్టీలన్నీ నరాలు బిగబట్టుకుని ఎదురుచూస్తున్నాయి. ఈ ఫలితాలతో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపిలపై అనుకూల, ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నేతల కదలికలు

విశాఖలో రాజకీయ నాయకుల కదలికలు చూస్తే లోపాయికారిగా పలువురు నాయకులు ఆయా ప్రధాన పార్టీలతో టచ్‌లో ఉన్న సమాచారంపై అంతటా చర్చ సాగుతోంది. దక్షిణంలో హుషారుగా ఉన్న ఒక టిడిపి నేత వైసిపిలో చేరతారన్న చర్చ జరుగుతోంది. భీమిలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు గంటా శ్రీనివాసరావు, రాజబాబు ఇద్దరూ టికెట్ ఆశిస్తున్న తరుణంలో ఎవరికిచ్చినా సమస్యే రానుంది. పెందుర్తి రాజకీయం రసవత్తరంగా ఉంది. అధికార, ప్రతిపక్షాలు రెండూ క్రియాశీలకంగానే జనాలను కదిలించడంలో నిమగ్నం అయ్యాయి. జనసేన పార్టీ కూడా తోడవ్వడంతో టిడిపి జోష్‌ను కొనసాగిస్తోంది. గాజువాకలో అధికార వైసిపిలో నిరుత్సాహం కనిపిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారంలో ఎంఎల్ఎ మాటలకే పరిమితం అవుతున్నారన్న చర్చ అంతటా ఉంది. దక్షిణంలో వైసిపిలో గ్రూపులాట కొనసాగుతోంది. వైసిపికి 2019లో అధికారం రాగానే టిడిపి నుంచి జంప్ అయిన వాసుపల్లి పట్ల పలువురు గుర్రుగా ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో ఆర్థిక సాయాలతో ఇదంతా కవర్ చేసే పనిచేస్తున్నారు వాసుపల్లి. పశ్చిమ నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి అడారి ఆనంద్ కుమార్ సరికొత్త వ్యూహంతో కదులుతున్నట్లు కనిపిస్తోంది. యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టిసారించారు. టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ గణబాబు ప్రజల్లో తనకున్న ఆదరణే గెలిపిస్తుందన్న ధీమాతో ఉన్నారు. తూర్పు నియోజకవర్గంలో టిడిపి నిశ్శబ్దం పాటిస్తోంది. ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఇక్కడ ప్రచారాన్ని శరవేగంగా చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్‌లను రద్దుచేసి తర్వాతైనా ఏదో ఒక రూపంలో ఈ పథకాన్ని కొనసాగిస్తే విశాఖ నగరంలో అధికార పార్టీ పరపతి పెరిగి ఉండేదన్న చర్చ సొంత పార్టీలోనూ జరుగుతోంది.

గంటాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

ఘనంగా గంటా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టిడిపి మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శుక్రవారం సాయంత్రం విశాఖలోని ప్రముఖ హోటల్‌లో ఘనంగా జరిగాయి. రాజకీయ నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి, విష్ణు కుమార్‌రాజు, సన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ శ్రీకాంత్ జాస్తిలతో పాటు ప్రముఖ అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారులు రాస్‌టేలర్, జెస్సీ రైడర్, జోనాథన్ బోథా, అశోక్ దిండా, పవన్ నేగి, మైఖేల్ బెవాన్ తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పండుగల సీజన్ కావున నగర ప్రజలకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగరాదన్నారు. నగరంలో చాలాకాలంగా పూర్ణా మార్కెట్ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో వ్యాపారస్తులు, వినియోగదారులు అసౌకర్యానికి గురవు తున్నారని, ఈ నేపథ్యంలోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P. 79/2022 in O.S.808/2020

Between :
Isai Jagadeesh ...D.Hr/Plaintiff
And
1. Pothamsetty Leela
2. Pothamsetty Udaya Bhaskar
3. Pothamsetty Nagamani
...J.Drs/Defendents

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటార్ల యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని తేది. **21-12-2023**న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **21-12-2023** ఉదయం గం॥**10.30** ని॥ల నుండి **సా॥5.00గం॥**ల మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొన దలచిన ఆసక్తిగలవారు పై తేదిన, పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

All that part and parcel of a site measuring an extent of 45 Sq.Yds being an undivided and unspecified share together with a Flat bearing No. T-3, with a plinth area of 910 Sft. bearing D.No: 58-1-421/23, Assessment No. 108625 6523, situated in Santhi Nilayam, Santhi Nagar, NAD Kotha Road, Visakhapatnam within the limits of GVMC, which is bounded as follows. **East:** Set backs, **South:** Flat No. T-2, belongs to G. Varahala Raju, **West:** Corridor & Lift, **North:** Flat No. T-4 belongs to V.Ch. Babu.

E.P. Amount : Rs. 20,69,564/-
D.Hr. Value : Rs. 30,00,000/-
Amin Value : Rs. 32,00,000/-
Market Value : Rs. 38,85,700/-
J.Dr Value : Not furnished

(By Order of the Hon'ble Court)
P. RAMJI & P.(M) HEMALATHA
Advocates
NAD Kotha Road, Visakhapatnam.
Cell: 98481 63349

IN THE HON'BLE COURT OF THE III ADDL. CHIEF METROPOLITAN MAGISTRATE AT: GAJUWAKA
C.C.865/2021

Between:
M/s. Shriram City Union Finanace Ltd, Gajuwaka Branch,
Rep by its Sr.Office Assistant
Sri K. Jagadeeswara Rao
...Complainant
And:
Sunkara Mallikarjuna Rao
...Accused

NOTICE

To,
The Accused:
Sunkara Mallikarjuna Rao,
S/o. Krishnaiah, Hindu,
aged 48 years,
R/at D.No.2-174,Sagar Nagar,
Visakhapatnam Dist-530045.

Please take notice that the above-named complainant filed the above C.C against youunder Section 138 & 142 of NI Act., and the matter stands posted **15-12-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate **15-12-2023**at **10:30 A:M** in the above Hon'ble Court to answer all material questions, failing which the matter will heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K.S.N. MURTHY,
Advocate
Gajuwaka, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 343/2023

Between:
Sariki Venkatalakshmi ...Plaintiff
And:
Korada Rajya Lakshmi
...Defendant

SUMMONS

To, **The Defendant:**
Korada Rajya Lakshmi,
W/o. Shankukha Rao,
R/at D.No.6-153/30/7,
Flat No.107, Ground Floor,
Raghava Enclaves,
Saipriya Gardens,
Srinivasa Nagar,Chandrampalem,
Madhurawada,
Visakhapatnam-41.

Please take notice that the above-named plaintiff has instituted the above suit against you and the defendant for recovery of amount of Rs.24,28,697/-with subsequent interest and costs and for other reliefs and the same stands posted to **21-12-2023** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By Order of the Hon'ble Court)
B.K.NAIDU, Advocate
50-16-14/2, Seethammapeta,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE CUM V ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P.1178/2023

Between:
Ganta Jenny Sekhar alias
Jaay Ganta ...Petitioner
And:
Ganta Manjula Raj ...Respondent

NOTICE

To, **The Respondent:**
Ganta Manjula Raj,
W/o. Ganta Jenny Sekhar alias
Jaay Ganta, Christian,
aged about 35 years,
R/at Flat No.102, Balaji Hill View,
Block-B, Vepagunta BRTS Road,
Visakhapatnam-530047.

Please take notice that the above FCOP.1178/2023 filed by the petitioner against the respondent for decree of divorce dissolving the marriage dated 18-10-2007, under Section 10 (1) & (x) of Divorce Act., and the matter stands posted to **22-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
B.V.V. Satyanarayana Murthii,
Baswa Saikiran &
Baswa Praveen
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P.240/2023

Between:
Sri Y.V. Trinadha Rao ...Petitioner
And:
D. Siva Kalyan & Another
...Respondents

NOTICE

To,
R-1: Damerla Siva Kalyan,
S/o. D. Mallikharjuna Rao,
Hindu, aged 38 years,
Tata Indica Driver cum
Owner of CAR bearing
Reg.No. AP 28 AV 2910,
D.No.14-1-99/4, Nowroji Road,
Visakhapatnam.

Please take notice that the above-named petitioner herein has filed the above M.O.P. against you and another respondent claiming compensation and the matter stands posted to **12-12-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **12-12-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

BODDETI RAJU, Advocate
27-10-28/4, Spring Road,
Visakhapatnam-2

తుపానుతో రైతుల్లో ఆందోళన

కోసిన వరి ఆరకుండానే కుప్పలు రంగు మారతాయని ఆవేదన

ప్రజాశక్తి-ఆనందపురం : రైతులను తుపాను భయం వెంటాడుతోంది. భారీ వర్షాలు పడితే కోసిన వరి చేతికి రాకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికతో కోసిన వరిచేను ఆరకుండానే (తడితోనే) అక్కడక్కడా పొలాల్లో కుప్పలు వేసేస్తున్నారు. ఎండకుండా కుప్పలు వేస్తే ధాన్యం ముక్కి చేను కుళ్లిపోతుంది. అందుకని కొంతమంది రైతులు తడితో కుప్పలు వేయడానికి భయపడుతున్నారు. బాగా పండిన చేను కోయకపోతే వరి వెన్ను రాలిపోతుందని మేఘాలు చూసుకొని కోస్తున్నారు. ఏదేమైనా ఈ ఏడాది రైతుకు వరి తీవ్రమైన బాధను మిగిల్చేలావుంది.

భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండలంలో 1520 ఎకరాలు, పద్మనాభంలో 6000 ఎకరాలు, భీమిలి మండలంలో 500 ఎకరాలు వరి సాగు వేశారు. ఈ ఏడాది వరి పంట వేయాల్సిన కాలంలో వర్షాలు సకాలంలో సరిపడా పడలేదు. దీంతో చెరువుల కింద కూడా పూర్తిస్థాయిలో వరి సాగుచేయలేని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షాలకు ఉడుపులు చేసిన తరువాత వర్షాలు ఎడపెట్టడంతో 8 వేల ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. అయినా కరువు మండలాలుగా

వరి పంటను కుప్పలు వేస్తున్న రైతులు

ప్రభుత్వం ప్రకటించలేదు. బోర్లు, బావులు, జలాశయాల కింద సాగుచేసుకున్న వరి పంట చేతికొస్తున్న సమయంలో తుపాను రావడంతో పండిన పంట కూడా ఇంటికొచ్చేలా లేదు. బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పండిన వరి పంటను కోయకుండా రైతులు ఆపేశారు. వరి కోతలు ముమ్మరమవుతున్న ఈ సమయంలో భారీ వర్షాలు కురవనుండడంతో రైతు కంట కునుకు కరువైంది. నిన్నటి వరకూ వర్షాల్లేక పంట వేయలేకపోయామని రైతులు బాధపడగా ఇప్పుడు వేసిన పంట చేతికి రాదన్న భయంతో ఉన్నారు.

ఆనందపురం మండలంలో బోని, కుసులవాడ, జగన్నాధపురం, పొడుగుపాలెం, చందక, వెంకటాపురం, ముచ్చర్ల, ముకుందపురం, సిర్లపాలెం, పీకేరు, గిడిజాల వేమగుట్టిపాలెం తదితర గ్రామాలలో వరి పంటలను కోసి ఆరబెట్టారు. పంట కోయకుండా వదిలేస్తే గింజలు పొలాల్లోనే రాలిపోతాయని కొందరు కోతలు చేశారు. కోసిన పంట ఎండకుండా వరికుప్పలు పెట్టాల్సి రావడంతో మదుపులు తడిసి మోపెడవుతున్నాయి.

తడి పొడితో కుప్పలు వేస్తుండటంతో ధాన్యం రంగు మారే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చిగా, రంగుమారిన ధాన్యానికి రైతు భరోసా కేంద్రాల ద్వారా సరైన మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. రెండవ పంటకు విత్తనాలు, ఎరువులను వంద శాతం సబ్సిడీతో అందించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

దుప్పటి ఇవ్వలేదని హత్య

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చట్టివానిపాలెంలో దుప్పటి ఇవ్వలేదని ఒకరిని తోటి స్నేహితులు హత్య చేసిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గాజువాక పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిరణ్ (35), కె.శ్రీరాములు, ఎస్.మోహన్ కలిసి స్క్రాప్ వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి చట్టివానిపాలెంలో వీరు పడుకున్నారు. కిరణ్ దుప్పటి ఇవ్వలేదని ముగ్గురి మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీరాములు మోహన్ కలిసి కిరణ్ నుదుటిపై రాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బీట్‌లో ఉన్న పోలీసులు గమనించి వెంబడించి వారిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. గుంటూరు నుంచి శ్రీకాకుళం సోనాలిక షోరూంకు తీసుకెళ్తున్న క్రొత్త ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఐచర్ వ్యాన్ ఢీ కొట్టడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ నడుపుతున్న పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన బండి భాస్కర్‌రెడ్డి (42) మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ఆనందపురం మండలంలోని గంభీరం, తర్లువాడ గ్రామాలలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అయిన గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పిఎం ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, జల్ జీవన్ మిషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, జన్ ధన్ యోజన, పిఎం స్వనిధి, నారీ శక్తి వందన్ అధినియమ్, ఎన్ఇపి (జాతీయ విద్యా విధానం), స్కిల్ ఇండియా మిషన్, స్వచ్ భారత్ మిషన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, జాతీయ ఉపాధి హామీ, గ్రామీణ సడక్ యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పివిబి.ప్రసాదరావు పట్నాయక్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, నాయకులు కె.రామనాయుడు, మీసాల రామునాయుడు, యోలూరు ధర్మవతి, అడ్డురు సురేష్, పి.చిన్నారావు, నిమ్మ కాయల అప్పలరాజు, కిలాని శ్రీనివాసరావు, తెడ్లాపు రత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

ప్రజాశక్తి- పద్మనాభం : బాల్య వివాహాలు చేయవద్దని ఎపిఎం ప్రభాకర్ కోరారు. మండలంలో మండల మహిళా సమైక్య ఆధ్వర్యాన జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమైక్య కార్యాలయంలో శనివారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. అన్ని గ్రామ సంఘాల ప్రతినిధులు, విఒఎలు హాజరై అన్ని గ్రామ సంఘాల్లో కూడా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ వారం రోజుల పాటు సభ్యులకు అవగాహన కలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఎపిఎం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పిల్లలను చదివించాలన్నారు. ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయవద్దని, ఈ నిబంధనలను విస్మరిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. బాల్య వివాహాల వల్ల మహిళలకు రక్తహీనత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ ప్రతినిధులు, సిసిలు, విఒఎలు హాజరయ్యారు.

నిధులు మళ్లిస్తే పంచాయతీల అభివృద్ధి ఎలా?

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి

ప్రజాశక్తి-ఆనందపురం : సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి పేర్కొన్నారు. ఆనందపురం మండలంలోని బోయపాలెం గ్రామంలో 'గ్రామాల అభివృద్ధికై సర్పంచుల సమర సంఖారావం' పేరుతో ఎపి సర్పంచుల సంఘం, ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యాన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ హక్కులను వైసిపి ప్రభుత్వం పూర్తిగా కాలరాసిందన్నారు. నిధులను ఇతర పనులకు దారి మళ్లిస్తే పంచాయతీలు ఏ విధంగా అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. సర్పంచుల్లో 90 శాతం వైసిపికి చెందిన వారే ఉన్నారని, వారు కూడా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పంచాయతీల్లో వీధి దీపాలు, కాలువల శుభ్రం వంటి కనీస పనులు కూడా చేపట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మి

పంచాయతీలకు వచ్చిన 14, 15 ఫైనాన్స్ నిధులు సుమారు రూ.8629 కోట్లును దారి మళ్లించి పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎపి పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యాన ఈ నెల 10వ తేదీన శ్రీకాకుళంలో ప్రత్యేక సమావేశం ఉందని, ఆ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు వానపల్లి ముత్యాలరావు, అనేపు రామకృష్ణనాయుడు, తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు కురిమిన లీలావతి, నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అవయవ, శరీర దానంపై అవగాహన

శరీర దాన పత్రాలు అందుకుంటున్న సీతామహాలక్ష్మి, సుధాకర్

ప్రజాశక్తి -తగరపువలసర : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో శనివారం అవయవ, శరీర దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ పివి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సావిత్రి భాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవయవ, శరీర దానం ప్రాధాన్యతను వివరించారు. ట్రస్టీలు నర్రా సీతా మహాలక్ష్మి, జి.కన్యాకుమారి, బివిఎస్.రామేశ్వరి, కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రతిమాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ జివి.శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 45 మంది దాతల నుంచి శరీర దాన పత్రాలను గూడూరు సీతా మహాలక్ష్మి, డాక్టర్ పివి.సుధాకర్‌కు అందజేశారు.

శెట్టిబలిజ వనభోజన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : కాకినాడు సమీపంలోని అమలాపురంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే శెట్టిబలిజ వనభోజనం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీతంపేటలోని ఒక హోటల్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమలాపురం శెట్టిబలిజ సంఘం అధికార ప్రతినిధి వాసంశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కుల బంధువులు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్ట మల్లేశ్వరరావు, కడలి సుబ్బారావు, బొక్క ఏడుకొండలు, బాలయ్య, వాసంశెట్టి అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

వరి పంట కోత ప్రయోగం పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం చందక రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న జగన్నాధపురం గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఆనందపురం మండల వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్య రత్న ప్రభ, ఇన్సూరెన్స్ కంపెనీ కో-అబ్జర్వర్ సమక్షంలో ఎఇఒ సింహాచలం, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఎన్.మాధురి బీజ వరి రకంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి పంట కోత పూర్తయిన రైతులందరూ కుప్పలుగా పెట్టి భద్రపరచుకోవాలని, లేదా నూర్పు చేసి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో భద్రపరచుకోవాలని చెప్పారు. కోత ప్రారంభించని వారు తుపాను ప్రభావం తగ్గేవరకు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఒక వేళ కోసిన వరి పంట తడిస్తే పనలపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకుంటే మొలకలు రాకుండా ఉంటాయని చెప్పారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని తుపాను బారి నుంచి వరి పంటను రక్షించుకోవాలని సూచించారు.

వెటరన్ క్రీడాకారుడు జయరామ్ కన్నుమూత

ప్రజాశక్తి -భీమునిపట్నం : తొలితరం వెటరన్ క్రీడాకారుడు, జివిఎంసి మూడో వార్డుకు చెందిన కొనాడ జయరామ్ (78) శుక్రవారం కన్ను మూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న జయరామ్ ఇంటి వద్దనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు తదితరులు అతని భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఎంతో మందిని వెటరన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

'చంద్రబాబుకు ఘన స్వాగతం పలకాలి'

ప్రజాశక్తి -భీమునిపట్నం : సింహాచలం దేవస్థానం దర్శనానికి ఈ నెల 3 వ తేదీన వస్తున్న టిడిపి అధినేత చంద్రబాబుకు భారీగా స్వాగతం పలకాలని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కోరాడ రాజబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మండల అధ్యక్షులు డివిఎస్.రాజు పాల్గొన్నారు.

'నడింపల్లి'లో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంట్యాం సమీపంలో ఉన్న నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన శనివారం యూత్ రెడ్ క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, రక్తం ఎందరికో ప్రాణదానం అన్నారు. అందరూ తప్పనిసరిగా రక్తదానం చేసి సమాజంలో తమ వంతు పాత్ర పోషించాలన్నారు. యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ, కళాశాల పరిధిలో విద్యార్థులు, సిబ్బంది కలిసి 116 యూనిట్ల రక్తాన్ని దానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యజమాన్యం, ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ పిఏ హరగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నరెడ్కో ప్రాపర్టీ షోకు ఆదరణ

ప్రజాశక్తి - పిఎం.పాలెం : పిఎం.పాలెంలోని కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన నరెడ్కో సంస్థ ఇంటర్నేషనల్ ప్రాపర్టీ షోను శనివారం కూడా నిర్వహించారు. సొంత ఇంటిని కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. స్టాల్స్ వద్ద వివరాలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు అంశాలపై రియల్ ఎస్టేట్ దిగ్గజాలు అంతా ఒక చోటకు చేరి సెమినార్లు నిర్వహించారు. ఈ ప్రాపర్టీ షో ఆదివారం కూడా కొనసాగనుంది.

భూమాత వెంచర్లన్నీ జాతీయ రహదారిని ఆనుకునే....

భూమాత సంస్థ ద్వారా అన్ని తరగతుల ప్రజలకు నమ్మకంతో కూడిన నాణ్యతమైన ఫ్లాట్లు, స్థలాలు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లు విక్రయిస్తున్నామని ఆ సంస్థ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్ ఎస్.నారాయణ రావు తెలిపారు. ముఖ్యంగా భూమాత సంస్థ నుంచి వేసిన వెంచర్లన్నీ తగరపువలస, ఆనందపురం, భోగాపురం, విశాఖపట్నం ప్రాంతాలలో జాతీయ రహదారిని ఆనుకుని ఉంటాయని తెలిపారు. అన్ని రకాల సదుపాయాలు కలిగిన వెంచర్లు ఒక్క భూమాతకే సాధ్యమని తెలిపారు. అందుబాటు ధరల్లో వేసిన వెంచర్లు అన్నింటిలో మెయింటినెన్స్ ఉందని, గతంలో వేసిన వెంచర్లకు ఇప్పటికీ మెయింటినెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బొబ్బిలిలో సుగంధ ప్లాంటేషన్ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

ప్రాపర్టీ షోలో వివరాలు తెలుసుకుంటున్న ప్రజలు

బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భాస్కరరావు, రమాప్రభ తదితరులు

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖలో ఈ నెల 14, 15, 16 తేదీలలో జరిగే బాలోత్సవ్ కార్యక్రమ పోస్టర్‌ను శనివారం డ్రైవర్స్ కాలనీ సాయి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో జీవ్స్ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, బాలోత్సవం అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె. రమాప్రభ, జీవ్స్ కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, జీవ్స్ సభ్యులు పి.లక్ష్మణస్వామి, రవి కుమార్, మౌళి తదితరులు ఆవిష్కరించారు. పిల్లల పండుగకు అన్ని ప్రయివేటు పాఠశాలల నుంచి పిల్లలు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. బాలల ప్రతిభా పాటవాలూ, శక్తి యుక్తులను బయటకు తీసేందుకు, సృజనను ప్రోత్సహించటానికి ఇది మంచి అవకాశం అని జీవ్స్ అధ్యక్షులు తెలిపారు.

'ఉత్తరం' పనులపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులపై జివిఎంసి జోన్-3, 5 ఇంజినీరింగ్ అధికారులతో రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు శనివారం నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణ పనులు, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రైనేజ్ తదితరాలపై చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్ఇ వేణుగోపాల్, సత్యనారాయణరాజు, జోన్-3 టౌన్ ప్లానింగ్ ఎసిపి రఘునందరావు, ఇఇ మచ్చిరాజు, రత్నాకర్‌రెడ్డి, ఎఇలు రత్నాకర్, రవణమ్మ, శ్రీనివాసరావు, అర్చన, ఉమామహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలను అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

జాబ్ మేళాలో 1828 మంది ఎంపిక

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి ఆండాలమ్మ కాలేజీలో వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఏర్పాటుచేసిన జాబ్‌మేళా ద్వారా 1828 మంది ఎంపికైనట్లు ఏపీ ప్రభుత్వ స్కిల్ ట్రైనింగ్, జాబ్ ఫెయిర్ సలహాదారుడు గాది శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆండాలమ్మ కాలేజీలో శుక్రవారం ప్రారంభమైన జాబ్ మేళా రెండో రోజు శనివారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆడారి ఆనంద్‌కుమార్ ఏర్పాటుచేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ డ్రైవ్‌ను విజయవంతం చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పి.సురేష్‌కుమార్, ఎపిఎస్ఎస్‌డిసి ఎమ్‌డి, సిఇఒ వినోద్ కుమార్, సీడాప్ సిఇఒ ఎంకెవి.శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ బెన్నీ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, పుర్రె సురేష్, ఉడా మాజీ చైర్మన్ రహమాన్, అంగ రాంప్రసాద్, నమ్మి శ్రీను, పలు కంపెనీల ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆలయ సేవకులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని దుర్గా మల్లేశ్వర సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యం సేవ చేసిన భక్తులకు ప్రముఖ వ్యాపారవేత్త కంచిపాటి విశ్వనాథనాయుడు చీరలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తిశ్రద్ధలతో ఉన్నప్పుడు మనసుకు శాంతి కలుగుతుందన్నారు. ఆలయ నిర్మాణానికి కృషిచేసిన యర్రా నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వేపగుంట : చీమలాపల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వేపగుంట నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడివివరపు మహేష్, ఉపాధ్యక్షులుగా వడ్లపూడి వినోద్, కార్యదర్శిగా మేడిశెట్టి శ్రీను, జాయింట్ కార్యదర్శిగా మల్లువలస రాంబాబు, కోశాధికారిగా వి.వాసు, సభ్యులుగా తాతబాబు, రమేష్ రాజన్ ఎన్నికయ్యారు.

విద్యతోనే మహిళా సాధికారత

మహిళా చైతన్య కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : మహిళలందరూ విద్యలో రాణిస్తే దేశ ప్రగతితో పాటు, మహిళా సాధికారత కలుగుతుందని, చదువుకున్న స్త్రీ ఇంటికి వెలుగవుతుందని ఆంధ్ర యూనివర్సిటీ లా కాలేజీ ప్రొఫెసర్ విజయలక్ష్మి స్పష్టంచేశారు. గాజువాక టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ మహిళా చైతన్య కళాశాల 29వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ విజయలక్ష్మి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రస్తుత ప్రపంచంలో మహిళలు పురుషులతో పోటీపడి వ్యాపార రంగంలో రాణిస్తున్నారంటే అది విద్య వలనే సాధ్యమైందన్నారు. విద్యతో వినయం, విజయం లభిస్తాయని చెప్పారు. తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ, విద్య ఉంటే ప్రపంచాన్ని చుట్టి రావచ్చన్నారు. ఇంటర్మీడియట్ చదువుకునే సమయంలోనే భవిష్యత్తుకు మార్గాలను వెతుక్కోవాలని, శ్రమించి చదువుకోవాలని సూచించారు. విద్యను ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా కళాశాల ప్రతినిధులు మంత్రి శంకర్‌నారాయణ, కె.శకుంతల, జెఎస్ఆర్ఎస్.వర్మ, మానవ హక్కుల ప్రతినిధి ఎం.శ్యాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ రాధ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కె.కె.రాజు శనివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కె.కె.రాజుకు అందించారు. వాటిని పరిశీలించిన కె.కె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

8 నుంచి ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు గో ఆధారిత ప్రకృతి రైతుసంఘం ఆధ్వర్యాన ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నామని భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్ స్వామి తెలిపారు. బివికె కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రకృతి ఆధారిత పంటలను విస్తారంగా పండించడం ద్వారా జల, వాయు, భూమి కాలుష్యం నివారించవచ్చన్నారు. 8వ తేదీన ఉత్తరాంధ్ర రైతులతో, 9న గ్రాడ్యుయేట్ రైతులతో, 10వ తేదీన మిద్దె తోట రైతులతో, 11వ తేదీన ఆర్గానిక్ వ్యాపారం చేసే వారితో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్య వర్మ, అశోక్ కుమార్, జెవి రత్నం, అశోక్, మురళీధర్ పాల్గొన్నారు

రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలి

వైవి సుబ్బారెడ్డిని కోరిన ఆడారి ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధి ఎన్ హెచ్-16 పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి అరకు బొడర రోడ్డును అనుసంధానం చేస్తూ నేతాజీ కాలనీ మీదుగా శాంతినగర్ చర్చి వరకు ఉన్న 30 అడుగుల రోడ్డును 60 అడుగులకు విస్తరించి మాస్టర్ ప్లాన్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కోరారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ స్థలంలో ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డును 60 అడుగుల రోడ్డుగా విస్తరిస్తే జాతీయ రహదారి నుంచి కొత్త రోడ్డు విమానాశ్రయం ప్రాంతాలకు వెళ్లే వారికి సులభతరంగా ఉంటుందని వివరించారు. ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని డిప్యూటీ మేయర్ శ్రీధర్ కూడా ఆయనకు తెలిపారు. సమస్య విన్న సుబ్బారెడ్డి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ బిఎస్.కృష్ణ (అల్లా కష్ణ), జియ్యాని మారుతీ, వెదుళ్ల శ్రీను, ఆర్‌పిలు, మహిళా నేతలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ప్లాంట్‌లో నియామకాలు, కాంట్రాక్ట్ లేబర్ నియామకాలు చేయాలని కోరుతూ జివిఎంసి 87వ వార్డు వైసిపి నాయకులు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి శనివారం క్యాంప్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. దీనిపై సుబ్బారెడ్డి స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి నిర్వాసితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవిందా, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, ప్రగడ శ్రీనివాస్, ప్రగడ శంకరరావు, బోండా గోవిందరాజులు, కెవి.నారాయణ, ప్రగడ గోవిందరాజులు, దాకా సత్తిబాబు, దాకా వరకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైవి.సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న 87వ వార్డు వైసిపి నాయకులు

ఆంగ్ల అక్షరాల ఫ్యాషన్ షో

ఆంగ్ల అక్షరాల ఫ్యాషన్ షోలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి- గాజువాక : చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులచే ఇంగ్లీష్ ఆల్ఫాబెట్స్ ఫ్యాషన్ షో శనివారం నిర్వహించారు. చిన్నారులు ఇంగ్లీష్ అక్షరాల రూపంలో దుస్తులు ధరించి, ర్యాంప్ వాక్ చేసి అందరినీ అలరించారు. యుకెజి చిన్నారులు ఇంగ్లీష్ ఆల్ఫాబెట్స్‌తో కూడిన రైమ్స్ పాడగా, పాటకు అనుగుణంగా మిగిలిన చిన్నారులు ఉత్సాహంగా ర్యాంప్ వాక్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యార్థులకు సులువుగా అక్షరాలు నేర్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, హేమలత, సునీత పాల్గొన్నారు.

వికలాంగులకు చట్టసభల్లో ప్రవేశం కల్పించాలి

ప్రజాశక్తి- మాధవధార : వికలాంగులకు చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో ప్రవేశం కల్పించాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. రాజ్యాంగంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్ష వలె మిగులుతున్నాయని పేర్కొన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభలలో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమాజంలో నేటికీ వారు ద్వితీయ శ్రేణి పౌరుల్లాగానే బతకాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆరోగ్య అసమానతల వల్ల మెరుగైన వైద్యం పొందడంలో వెనకబడి ఉన్నారని తెలిపారు. సుగమ్య భారత్ అభియాన్ చట్టం వికలాంగులకు పూర్తిగా ఉపయోగపడాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్లు, పూర్తిగా ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. ఫిలిపియన్స్, దుబాయ్, యుఎఇ తదితర దేశాల్లో నిర్వహిస్తున్న మోడల్ డిజేబిలిటీ మనదేశంలో కూడా చేపట్టడం వల్ల వికలాంగులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్

మాట్లాడుతున్న రైతు నేత అప్పలరాజు, చిత్రంలో పలు సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టి రైతులను, కూలీలను ఆదుకోవాలని రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు గాడి బాలు, రైతు సంఘం నాయకులు కె.శంకరరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో తీవ్రమైన కరువు విలయతాండవం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకుండా రైతులకు ద్రోహం చేసిందన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండీ కూడా కరువు పరిస్థితులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్‌పి సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కరువు జిల్లాగా ప్రకటించాలని ఈ నెల 5న మండల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అప్పటికీ స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌వి.నాయుడు, సాపిరెడ్డి నారాయణమూర్తి, బి.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, ఎస్.గోవిందరావు, ఎన్.సత్యనారాయణ, మాణిక్యం, వరలక్ష్మి పాల్గొన్నారు.

బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నాగజగదీష్

సిపిఎం నేత బాలకృష్ణకు నాగజగదీష్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం నాయకులు అంగులూరి బాలకృష్ణ గత 15 రోజుల నుండి అనారోగ్య కారణాలవల్ల విశాఖపట్నం విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకొని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవివి నారాయణరావు శనివారం ఆసుపత్రిలో బాలకృష్ణను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యుల్ని ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

కొండమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేట గ్రామానికి చెందిన గొర్లె కొండమ్మ (102) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం రాత్రి కన్నుమూసింది. ఈమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వందేళ్ళు పైబడిన ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా తన పనులు తాను చేసుకుంటూ ఆరోగ్యంగా జీవించింది. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఈ రోజుల్లో కూడా వందేళ్ళ పూర్తి చేసుకోవడం చాలా గొప్పవిషయమన్నారు. వారి నిత్య నియమాలు, ఆహార పద్ధతులు చాలా మంచివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నివాళులర్పించి, ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు.

17న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలో ఈ నెల 17న మిస్టర్ ఆంధ్రా-2023 పేరుతో రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తెలిపారు. స్థానిక గవరపాలెం రైతు భారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల్లో క్రీడాకారులంతా పాల్గొనాలని, వారికి అవసరమైన సౌకర్యాలు, సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ పోటీలను రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్, ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు భారతి ప్రాంగణంలో 17న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విన్నర్‌కు రూ. 25వేలు ప్రైజ్‌మనీ, సర్టిఫికేట్, మెమోంటో, రన్నర్‌కు రూ.10వేలు ప్రైజ్‌మనీ, సర్టిఫికేట్, మెమోంటో అందిస్తారన్నారు. ఈసమావేశంలో అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్లు కాండ్రేగుల అజయ్, కింతాడ శ్రీరాం, జి.వెంకట్, జాయింట్ సెక్రటరీలు కరణం చినబాబు, బుద్ద అప్పలనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎన్‌వి చంద్రశేఖర్, కె.నరేంద్ర, మెంబర్లు పాల్గొన్నారు.

వృత్తి కోర్సుల్లో శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణ సంస్థాన్ సహకారంతో టైలరింగ్, బ్యూటీషియన్ (బ్యూటీ కేర్), కంప్యూటర్ ఉచిత తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో పాల్గొన్న డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతల వల్ల ఆన్‌లైన్ వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. జన శిక్షణ సంస్థాన్ (జెఎస్‌ఎస్) ఛైర్మన్ సీ.వీ. రామరాజు మాట్లాడుతూ శిక్షణ కాలంలో స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, జె.ఎస్.ఎస్ డైరక్టర్ కె.నాయుడు, మళ్ల బాపునాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖలో

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ కోఆర్డినేటర్ ఉద్యోగాలకు కాంట్రాక్టు పద్ధతిన అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రెండు ఉద్యోగాలు అనకాపల్లిలోను, బ్లాక్ కోఆర్డినేటర్ రావికమతంలో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌కు 25- 40సంవత్సరాలు, డిగ్రీ లేదా కంప్యూటర్ సైన్స్, ఐటీ ఉత్తీర్ణత ఉండాలని, అప్లికేషన్ మెయింటెనెన్స్ అండ్ సపోర్ట్‌లో 2 సంవత్సరాలు అనుభవం, స్థానిక భాషలో చక్కగా మాట్లాడడం రాయడం వచ్చి ఉండాలని, కంప్యూటర్ విజ్ఞానం కలిగి ఉండాలని, ఫీల్డ్ వర్క్ చేయవలసి ఉంటుందని, స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు అసిస్టెంట్ 25 నుండి 40 సంవత్సరాలు వయసు, పర్యవేక్షక నైపుణ్యం, 2 సంవత్సరాల పనిచేసిన అనుభవం. స్థానిక భాషలో మాట్లాడడం, రాయడంతో పాటు ఆంగ్లంలో కూడా ప్రావీణ్యత కలిగి ఉండాలన్నారు. బ్లాక్ కోఆర్డినేటర్ ఉద్యోగానికి 25 నుండి 40 సంవత్సరాల వయసు, డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, సాంకేతిక, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌లో 2 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. పూర్తి వివరాలు దరఖాస్తుఫారం www.anakapalli.ap.nic.in లో లభ్యం అవుతాయని చెప్పారు. ఈ నెల 14న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు పంపించాలని కోరారు.

డిజిటల్ టెక్నాలజీతో సమర్థవంతమైన బోధన

ప్రజాశక్తి-అనకాపల్లి : డిజిటల్ టెక్నాలజీతో విద్యార్థులకు సమర్థవంతమైన బోధన అభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం అసిస్టెటివ్ టెక్నాలజీపై డివైసెస్ వినియోగంపై జిల్లా స్థాయి ఒక్కరోజు వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు పిల్లల్ని జిల్లా స్థాయిలో గుర్తించి పాఠశాలలో అడ్మిషన్ పొందేటట్లు, యూడైస్ ప్లస్ లో వారిని నమోదు చేయడం వంటి ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ డిఈఓ అప్పారావు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ఉన్న పిల్లలను రోజు పాఠశాలకు హాజరయ్యేటట్లు, ఫిజియోథెరపీ క్యాంపులకు హాజరయ్యేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వరరావు, జిల్లా సహిత విద్యా విభాగ సమన్వయకర్త శకుంతల, కన్సల్టెంట్ నరసింహం, పి.అమ్మి నాయుడు, హెచ్ఎం రుద్ర రాణి పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు ద్విగుణీకృతం కావాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు ద్విగుణీకృతం కావాలని స్థానిక డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ సూచించారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌పై ప్రచురించిన పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. భవిష్యత్తులో ఇటు వంటి పుస్తకాలు, రీసెర్చ్ పేపర్స్‌ని మరిన్ని ప్రచురించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు సిఎస్ఇ విభాగ అధిపతి డాక్టర్ కె. సుజాత, ఎ. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె. పార్వతి, కృష్ణ నాగ్ పాల్గొన్నారు.

బస్‌పాస్‌లు మంజూరు చేయాలని నిరసన

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ నేతలు, నిరుద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు బస్ పాస్‌లు మంజూరు చేయాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం డిఎంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నలుమూలల నుండి వందల మంది నిరుద్యోగులు కోచింగ్ తీసుకోవడం కోసం జిల్లా కేంద్రమైన అనకాపల్లికు వస్తున్నారని, అయితే వారికి బస్ పాస్లు లేకపోవడం వలన నెలకు 2000 పైగా చార్జీల కోసమే ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చార్జీలు అదనమైన భారంగా మారిందని, కావున నిరుద్యోగుల బాధను అర్థం చేసుకొని వెంటనే విద్యార్థుల మాదిరిగా కోచింగ్ తీసుకున్న అభ్యర్థులకు కూడా బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జీ.తరుణ్, అభ్యర్థులు వినోద్, రవి, చందు, శంకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులకు కట్టబెట్టడం సరికాదు

ప్రజాశక్తి -అనకాపల్లి : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు ఉన్న ఒకే ఒక్క పదోన్నతిని కూడా ఫార్మాసిస్ట్‌లకు కట్టబెట్టే జీవోని వెంటనే ఉపసంహరించుకోవాలని విశాఖ ఉమ్మడి జిల్లా ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ ల్యాబ్ అటెండెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మీసాల సూర్య శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల కాలం రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలను అందిస్తామనీ, మా ల్యాబ్ టెక్నీషియన్స్ సేవలను గుర్తించలేదన్నారు.

రూ.10 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి

ప్రజాశక్తి-కసింకోట : మండలంలోని ఎన్.పేట గ్రామంలోని శ్మశాన వాటికను ఆ గ్రామానికి చెందిన ఉషోదయ కాలేజీ చైర్మన్ జె.రమణాజీ అభివృద్ధి చేశారు. తన తల్లిదండ్రులు సోమినాయుడు నాగలక్ష్మి జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.10 లక్షలతో శ్మశాన వాటికలో షెడ్డు, ప్రహరీ గోడ, శివుడు విగ్రహం నిర్మాణం చేపట్టారు. శనివారం అభివృద్ధి కార్యక్రమాలను విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ కర్రి సుందరయ్య చేతులు మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణాజీ మాట్లాడుతూ పుట్టిని గ్రామంలో సేవ కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తంటపురెడ్డి హరిబాబు, తంటపురెడ్డి శ్రీను, చిరంజీవి, తంటపురెడ్డి శేషు, మందపల్లి ప్రసాద్, తంటపురెడ్డి బాబూరావు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అధికార ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న అక్రమ, అనధికారిక గ్రావెల్ తవ్వకాలపై తక్షణమే జ్యూడిషియల్ ఎంక్వయిరీ చేయించాలని అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం శంకరం గ్రామం కొండ సర్వే నెంబరు 56లో జరుగుతున్న కొండ తవ్వకాలను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సహజ వనరుల దోపిడీ వెనుక అధికార పక్షం నేతలున్నారని, అందుకు అధికారులు అండగా నిలిచారని ఆరోపించారు. జిల్లాలో అనకాపల్లి, కశింకోట తదితర మండలాల్లో గత నాలుగున్నరేళ్లుగా ఇసుక, మట్టి, గ్రావెల్, గ్రానైట్ కొండలు సహజ వనరులు దోపిడీ చేస్తున్న భాగోతాలు ప్రసార మాధ్యమాల్లో కథనాలు వెలువడుతున్నా అధికారయంత్రాంగం మొద్దునిద్రలో ఉండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కరణం సన్యాసిరావు, కర్రి శ్రీనివాసరావు, బొట్ట రమణాజీ, జనపరెడ్డి గణేష్, కొట్ని రామకృష్ణ, కొణతల శ్రీనివాసరావు, విల్లూరి రమణబాబు, మళ్ల శివన్నారాయణ, దాడి వేణు ఉన్నారు

ఎన్‌టిఆర్ ఆసుపత్రికి ఏషియన్ పెయింట్స్ వితరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి ఏషియన్ పెయింట్స్ సంస్థ సిఎస్‌ఆర్ నిధుల సుమారు రూ.15 లక్షలతో పరికరాలను అందించింది. ఆపరేషన్ టేబులు (3), ఆపరేషన్ లైట్లు (3), పేషంట్ బెడ్లు (3), స్కానింగ్ మిషన్ (1), ఆపరేషన్ సంబంధిత వస్తువులు అందించింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బి.వి.సత్యవతి విష్ణుమూర్తి మాట్లాడుతూ త్వరలో హాస్పటల్ ఆవరణలో 50 పడకలతో క్రిటికల్ కేర్ బ్లాకు అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ ఎస్ శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి, ఏషియన్ పెయింట్స్ యాజమాన్యం బి జగన్నాథ్, హెచ్ఆర్ మేనేజర్ శ్రీజిత్, హెచ్ఆర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లి పిఎసిఎస్ సేవలు భేష్

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : సహకార సంఘ సభ్యులకు సేవలు అందించుటలో నాగులాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పనితీరు బాగుందని అని ఒరిస్సా రాష్ట్ర సహకార శాఖ ప్రిన్సిపల్ మమతా సాహూ కొనియాడారు. మండలంలోని నాగులపల్లి సహకార సంఘాన్ని శనివారం ఒరిస్సా రాష్ట్ర సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్టర్లు, ఆడిటర్స్ డిసిఎంఎ కోర్సులో భాగంగా అధ్యయనం చేసే నిమిత్తం సందర్శించారు. సంఘ చైర్మన్ మల్ల ఉమామహేశ్వరరావు, సీఈవో మల్ల స్వామి సంఘ ఆర్థిక కలాపాలు వివరించారు. మమతా సాహూ మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రంలోని సహకార సంఘాల కంటే ఆంధ్ర రాష్ట్ర సహకార సంఘాలు అబివృద్ధి చెందినట్లు చెప్పారు. సంఘ సభ్యులు నరాల శెట్టి బాబురావు నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఇందేసమ్మ అమ్మవారి పండగ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ శివారు సిరపురపు వారి చేలు వద్ద శ్రీఇందేసమ్మ పేరంటాలు అమ్మవారి పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వియ్యపు చిన్నా, ఇందల కొండలరావు, నకిరెడ్డి చిన్నా రావు, బండారు అప్పల నాయుడు, సిరపురపు లక్ష్మీ, సిరపు సన్నిబాబు, సిరపరపు నాయుడు, సిరపురపు కనకారావు, సిరపురపు దేముడు, తాతబాబు, నాయుడు, గుర్రం అప్పలరాజు, అప్పారావు, నాయుడు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మునగపాక గ్రామానికి చెందిన పీలా జగ్గయ్యమ్మ (72) అనారోగ్యంతో శనివారం మరణించగా, ఆమెకు కొడుకులు లేకపోవడంతో కుమార్తె వరాహలక్ష్మి తలకొరివి పెట్టి, అంత్యక్రియలు నిర్వహించింది. రెండేళ్ల క్రితం మరణించిన తండ్రికి కూడా ఆమె తలకొరువు పెట్టింది. కొడుకులు లేని లోటు తీర్చి తల్లిదండ్రులకు తల కొరివి పెట్టిన వరాహ లక్ష్మీని చూసి సమాజంలో ఇకనైనా మార్పు రావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా గౌరీ పార్వతుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శతకం పట్టు రామకోవుల వద్ద, గవరపేట రామకోవుల వద్ద ఏర్పాటుచేసిన గౌరీ పార్వతుల సారే మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ప్రతి ఇంటి నుంచి వారికి తోచిన పిండి వంటలు తయారు చేసి మహిళలు వాటిని తీసుకొని గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని ఇదేవిధంగా కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. అనంతరం గౌరీ పార్వతుల నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిడతలు తప్పుడు గుళ్ళు భజనలు నిర్వహించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని నారప్పపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో పాలు పోసిన రైతులకు పశువులకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. డాక్టర్ మనోజ్ కుమార్ చేతుల మీదుగా పాడి 50పశువులకు డి వార్మింగ్ చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, ఎల్ నాయుడు, సంతోష్, ఆర్ అప్పలనాయుడు, ఎల్ శ్రీనివాసరావు, ఎల్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహం పునర్నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరడంతో ఉత్తరాంధ్ర, కళింగాంధ్ర జై జవాన్ జై కిసాన్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ గండి సన్నిబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గతంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థాపించారని, నేడు విగ్రహం శిథిలావస్థకు చేరిందని, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంపై శుక్రవారం రాత్రి లంకెలపాలెం ఎస్సీ కాలనీ, గంగిరెడ్ల కాలనీ ప్రచారం చేశారు. జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ దామురోతు అర్జున్, ఎస్సీ కాలనీ నాయకులు అప్పికొండ నర్సింగ్ రావు, పప్పలవరహా నరసింహా మూర్తి, గంగిరెడ్ల కాలనీ నాయకులు ధనకొండ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల నమోదు : జెసి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఓటర్ల నమోదు పక్కాగా జరగాలని, ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతపై కేంద్రీకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉన్న 201 నుంచి 207 నెంబర్ల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఏమైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే వాటిని వెంటనే పరిశీలించాలన్నారు. 9వ తేదీ లోగా అర్హత వున్న వారినందరినీ ఓటర్ల జాబితాలో నమోదు చేయాలన్నారు. పర్యటనలో అనకాపల్లి ఆర్డీవో ఏ.చిన్నికష్ణ, హెచ్ డి టి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు సూచించారు. మండలంలోని ఉగ్గినిపాలెం సచివాలయం వద్ద కొత్త ఓటరు నమోదు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది : ఓట్ల మార్పులు చేర్పులు విషయంపై బిఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో సువర్ణ రాజు అన్నారు. శనివారం కోమలపూడి 120 పిఎస్‌ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో బిఎల్ఓ పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని భోగాపురం గ్రామంలో పోలింగ్ స్టేషన్ 210 ఓటర్ల జాబితాను సిపిఎం మండల నాయకులు కె సోము నాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ఏ నూకరాజు, గ్రామ సేవకుడు అప్పారావు సిహెచ్ శేషు పాల్గొన్నారు.

నక్కపల్లి:ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు రెండు రోజుల పాటు ఓటర్ ప్రత్యేక క్యాంపెయిన్ విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జి.ప్రభాకర్ రావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నానాజీ, ఏవో సీతారామరాజు తదితర అధికారులు పాల్గొన్నారు..

గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురంలో ఓటరు వెరిఫికేషన్‌ను ఆర్ఐ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదుపై అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో సాంబశివరావు, సచివాలయ కార్యదర్శి రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా తయారీలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల అధికారి రామలక్ష్మి సూచించారు. శనివారం మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎన్నికల క్యాంపెయిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఫారమ్ 6,7,8, పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు జానకమ్మ, సూపర్వైజర్లు, సోమశేఖర్, చంద్రశేఖర్,జ్యోతి, ఉర్ధవరావు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు చేస్తున్న మాధవి

ఓటర్ల నమోదు కేంద్రంలో పలు సూచనలిస్తున్న గంగారావు

వేపగుంట : అర్హులందరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని బిఎల్ఓ పి.మాధవి కోరారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా 94వ వార్డు పరిధి నాయుడుతోటలోని భాష్యం స్కూల్‌లో రెండు రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ, ఓటరు నమోదు చేసుకోవడానికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, వయసు నిర్ధారణకు విద్యార్హత సర్టిఫికెట్ తీసుకురావాలని వివరించారు.

ఓటర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన గంగారావు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కేంద్రాలను 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివారం కూడా ఈ ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాలు ఉంటాయని టౌన్‌షిప్‌లో వున్న ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కొత్తగా ఓటు నమోదు, ఓటు మార్పు, తప్పులు సరిద్దడం వంటివి ఈ కేంద్రంలో చేసుకోవచ్చని తెలిపారు. 1 నుంచి 6 సెక్టార్ల పరిధిలోని వారు డిఎవి, సెంట్రల్ స్కూల్, విశాఖ విమల విద్యాలయంలో, 7 నుంచి 12 సెక్టార్ల పరిధిలో ఉన్నవారు డిపిఎస్, జ్యోతి బాలవిహార్‌లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయం చేయమంటే నోటీసులిచ్చారు

ఎంపిడిఒకు గ్రామ వాలంటీరు ఫిర్యాదు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద మురుగునీటి సమస్యను పరిష్కరంచాలని పంచాయతీ కార్యదర్శికి విన్నవిస్తే తనకు నోటీసులు ఇచ్చారని గ్రామ వాలంటీరు కూండ్రపు అప్పారావు శనివారం ఎంపీడీవో హేమచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. తాము నివసిస్తున్న వీధిలో గతంలో సిమెంట్ రోడ్డు, మురుగునీరు కాలువ ఉండేవని, తన ఇంటి పక్కనున్న వారు వారి ఇంటి దగ్గర ఉన్న కాలువను పూర్తిగా సిమెంట్‌తో పూడ్చి వేశారని తెలిపారు. వాడుతున్న మురుగు నీటిని రోడ్డు మీదకు వదలడంతో తమ ఇంటి వద్ద రోడ్డు మీద నిల్వ ఉంటుందని, కాలువను పూడ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గత వారం పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్ వారికి ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. ఫిర్యాదుపై న్యాయం చేయకుండా తమకే నోటీసులు పంపించారని, తన ఇంటి నిర్మాణానికి ప్లాన్ లేదని, ఇంకుడు గుంత తవ్వి ఆ గుంతలో నీరు చేరే విధంగా ఏర్పాటు చేయాలని, లేకుంటే పోలీసు కేసు పెడతామని పంచాయతీ కార్యదర్శి బెదిరించారని అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇంటికి ఇప్పుడు ఏవిధంగా ప్లాన్ అడుగుతారని, గ్రామంలో ఎవరికీ లేని ప్లాన్‌లు తనకే ఎందుకని ప్రశ్నించారు. న్యాయం చేయమంటే ఈ విధంగా తనను హింసిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీడీవో హేమచంద్రరావు విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీవోలొచ్చినా విడుదల కాని చెరుకు బకాయిలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు గతేడాది బకాయిలు విడుదల చేశామని, జిఒ వచ్చిందని అధికారులు చెప్పి 20 రోజులు దాటినా నేటికీ నిధులు రాకపోవడం విడ్డూరంగా ఉందని చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోవాడ చెరుకు రైతులకు ఇంకా రూ.321 చొప్పున మొత్తం రూ.7.1 కోట్లు, చెరుకు రవాణా చార్జీల రూపంలో మరో రెండు కోట్ల రూపాయలు, మొత్తం రూ.9.1 కోట్లు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. కార్మికుల వేతన బకాయిలు, ఫ్యాక్టరీ ఓవర్ హాలింగ్ పనులకు కలిసి రూ.25 కోట్లు ఇవ్వాలని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు మూడు నెలల క్రితం ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఆ నివేదికలన్నీ బుట్ట దాఖలయ్యాయన్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన మహాజనసభలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు ఏడు కోట్ల రూపాయలు జమవుతాయని చెప్పారని, కాని నేటికీ జమ కాలేదని పేర్కొన్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా వరప్రసాద్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అశోక చక్ర అవార్డ్ గ్రహీత కీర్తిశేషులు కరణం వరప్రసాద్ త్యాగనిరతి ఎప్పటికీ మరవలేనిదని ఎంపీ డాక్టర్ సత్యవతి పేర్కొన్నారు. వర ప్రసాద్ జయంతి వేడుకలను శనివారం సాయి కుల్వంత్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఏటా జయంతి వేడుకలు నిర్వహించాడాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డి ఎస్ పి సుబ్బరాజు, తల్లిదండ్రులు కరణం వెంకటరమణ, సత్యవతి, సోదరి కళావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి లక్ష్మణ్, కళాశాల కరస్పాండెంట్ కామరాజు, ఫారం ఫర్ బెటర్ అధ్యక్షులు దేముడు మాస్టారు, ఉమామహేశ్వరి, డాక్టర్ విష్ణుమూర్తి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రెటరీ ఎల్.చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా శనివారం సబ్బవరం మండలంలో పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అనకాపల్లి జిల్లా రీజనల్ సెక్రెటరీ పైలా ప్రసాద్, బ్రాంచ్ సెక్రెటరీ మురళి, రమేష్, నిహార్ పాల్గొన్నారు.

8న పిఎసిఎస్ శత వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శతవసంత వార్షికోత్సవ వేడుకలు ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నాని, వాటిని జయప్రదం చేయాలని సంఘ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు కోరారు. ఈ మేరకు శతవసంతాల వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు యువి రమణమూర్తిరాజు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పిల్లి అప్పారావు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో రైతులకు గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించి పలు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యాలయ సభ్యులు రమాదేవి, శ్రీనివాసరావు, విద్యార్థులు కె.ఆలేఖ్య,ఆర్. భార్గవి, పి. దుర్గా భవాని,ఎ. గౌతమి, ఎస్. మానస తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని జనసేన నిరసన

ప్రజాశక్తి-చోడవరం : పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ జనసేన ఆధ్వర్యంలో స్థానిక మండల కార్యాలయం వద్ద శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు టిడిపి శ్రేణులు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోనూ వేసిన వరి పంట ఎండిపోయిందన్నారు. కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా రాష్ట్రంలో కరువు మండలాల ప్రకటించిన ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక్క మండలం కూడా కరువు మండలం ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే కరువు మండలం ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, జనసేన నాయకులు అల్లం రామప్పరావు, కర్రి రమేష్, తుమ్మపాల రమేష్, నందవరపు రమాదేవి, గూనూరు ములునాయుడు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక

శాస్త్రి . అధ్యక్షులు

మహేష్, ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి -నక్కపల్లి:యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక శుక్రవారం సాయంత్రం ఏకగ్రీవంగా జరిగింది. నక్కపల్లిలోని మెయిన్ స్కూల్‌లో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా ట్రెజరర్ రాజేష్ ఎలక్షన్ అధికారిగా వ్యవహరిస్తూ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.ఆర్.కె శాస్త్రి, జి.మహేష్ ,గౌరవాధ్యక్షులుగా కే రామచంద్రరావు, సహాధ్యక్షులుగా బి.నాగమణి, విజిఎస్ సూరిబాబు, ట్రెజరర్‌గా కెవి సత్యనారాయణ, మహిళ కార్యదర్శిగా ఉమాదేవి లతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, డిఎ, పిఎఫ్, లోన్స్, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, జీవో 117 రద్దు చేయుట కు యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. .

రోలుగుంట:మండలంలోని జగ్గంపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అనంతరం యుటిఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షులు పి.గాయత్రి హాజరయ్యారు. మండల నూతన కార్యవర్గానికి ఎన్నిక నిర్వహించారు. మండల నూతన అధ్యక్షులుగా కాళింగ సతీష్, ప్రధాన కార్యదర్శిగా వంశీ, గౌరవ అధ్యక్షులుగా యు.నాగ భూషణం, సహాధ్యక్షులుగా కె.కేశవరావు, ఎన్.కనక మహాలక్ష్మి, కోశాధికారిగా బి.భారతి, జిల్లా కౌన్సెలర్‌గా కె. విశ్వనాధం, మహిళా కార్యదర్శిగా శ్యామల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారందరినీ మండల ఉపాధ్యాయులు అభినందించారు. యు.టి.ఎఫ్. విద్యా రంగ సంక్షేమానికి అనేక పోరాటాలు చేస్తుందని, పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేస్తుందని అధ్యక్షుడు కాళింగ సతీష్ తెలియజేశారు.

సతీష్, అధ్యక్షులు

వంశీ ప్రధాన కార్యదర్శి.

రాయితీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో మూడవ రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై విత్తనాలను సర్పంచ్ ఎడ్ల కళావతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాడుగుల మండల వ్యవసాయ అధికారి ఎం. వాసు దేవరావు మాట్లాడుతూ, రబీ పంట కాలానికి సంబంధించిన విత్తనాలు మినుములు 30 క్వింటాళ్లు, పెసర 5 క్వింటాళ్లు, వరిలో రెండు రకాలు కలిపి 50 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.కె చైర్మన్ కుక్కర శ్రీధర్, ఆర్ బికే సిబ్బంది బి.జ్యోతి, టీఎంవి రేణుక పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

విరాళం అందిస్తున్న రామానాయుడు

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - మాడుగుల:మండలంలోని కేజే పురం ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విరాళం అందించారు. శనివారం కేజే పురంలో శ్రీ దుర్గా దేవి అమ్మవారిని రామానాయుడు దర్శించుకున్నారు. అనంతరం దుర్గాదేవి గుడి నిర్మాణానికి రూ.10,116 విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీలు బీశెట్టి శ్రీనివాసరావు, చిన్నం లోవతల్లి దాలినాయుడు, గ్రామ అధ్యక్షులు రాపేటి జోగినాయుడు, కర్రి నాగమణి, గుడి నిర్మాణ కమిటీ సభ్యులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్రను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పిలుపు నిచ్చారు. టిడిపి కార్యాలయంలో శనివారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి లోకేష్ పాదయాత్ర వివరాలను వెల్లడించారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత నాయకత్వంలో ఈనెల 6వ తేదీ నుంచి పాయకరావుపేట నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర ప్రారంభం కానుందని , ఘన స్వాగతం పలికేందుకు సిద్ధం కావాలన్నారు. పాయకరావుపేట మండలం, గోపాలపట్నం మీదుగా 6వ తేదీ సాయంత్రానికి గునుపూడి- -బంగారమ్మ పేట సెంటర్స్ వద్దకు చేరుకుంటారని, అక్కడి నుంచి డిఎల్ పురం చేరుకుని రాత్రి బస చేసి 7న ఉదయం మూలపర్ర, అమలాపురం మీదుగా మత్స్యకారుల గ్రామమైన రాజయ్య పేటకు చేరుకొని బీసీ సభలో మాట్లాడతారన్నారు. ఉపమాక వెంకటేశ్వర స్వామి దర్శనం చేసిన అనంతరం నక్కపల్లి ఎస్సీ కాలనీ మీదుగా ఎస్.రాయవరం మండలం, అడ్డరోడ్డు వద్ద 8న జరిగే బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన వెంకటరమణ, కొప్పిశెట్టి శ్రీను, నానేపల్లి రాఘవులు, గోసల శ్రీకాంత్ రాగిణి వెంకటరమణ, గింజల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి పథకాలపై ప్రచారం

నక్కపల్లి:మండలంలోని చిన్న రామభద్ర పురంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటి పై శుక్రవారం రాత్రి టిడిపి శ్రేణులు ప్రచారం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి గ్యారెంటి పథకాలపై ప్రచారం చేసారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొరిమి గణేష్, నాయకులు దేవర సత్యనారాయణ, కొరిమి సూర్య గణేష్, సత్యనారాయణ, సూరిబాబు, రామకృష్ణ, అప్పారావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

బుచ్చయ్య పేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన నిఫెస్టోపై తెదేపా కార్యకర్తలు ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికి తిరిగి తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలతో పాటు విద్యాభ్యాసానికి అమ్మకు వందనం, అన్నదాత, ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు దొంకిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకర లక్ష్మి, శనివాడ శ్రీను, బంటు నాయుడు తదితరులు పాల్గొన్నారు

అవగాహన కల్పిస్తున్న టిడిపి నేతలు

సర్వే చేస్తున్న అధికారులు

వివాదాస్పద భూమిపై సర్వే

ప్రజాశక్తి- చీడికాడ:గత రెండేళ్లుగా ఇరువురి మధ్య కొనసాగుతున్న వివాదాస్పద భూమిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ సర్వే ఇన్స్పెక్టర్ సర్వే నిర్వహించారు. చీడికాడ మండలంలోని మంచాల గ్రామంలో సర్వే నెంబర్ 105 ,107, 114లోని భూముల్లో సమస్య గత రెండేళ్లుగా కొనసాగుతుంది. దీనిపై ఇరు వర్గాలు తహసిల్దార్ కార్యాలయానికి ఫిర్యాదులు చేయగా గతంలో పలుమార్లు సర్వే నిర్వహించారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేయగా నర్సీపట్నం డివిజన్ డిప్యూటీ సర్వే ఇన్స్పెక్టర్ వెంకట రమణ తన సిబ్బందితో శనివారం గ్రామంలో సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పైప్‌లైన్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని వెంకటనగరం గ్రామంలో కాకినాడ సెజ్‌కు సంబంధించిన పైపులైను అనుమతులు రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణసరూప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇప్పటికే పలు కంపెనీల కారణంగా మత్స్య సంపంద లేక చేపల వేట సాగని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారని తెలిపారు.ఈ కంపెనీతో సముద్రం లోని ఐదు కిలోమీటర్లు వరకూ చేపలు పడటం లేదన్నారు. కాకినాడ ప్రాంతంలో ఉన్న బల్క్ డ్రగ్ కంపెనీ వ్యర్థ పదార్థాల రసాయనాలను వెంకటనగరం రేవు దగ్గర విడిచి పెట్టడానికి 30 కిలోమీటర్లు మేర పైపు లైన్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని జల్లూరు సుంకపూరులో శనివారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో వికసిక్ భారత్‌లో భాగంగా శనివారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి బానోజీరావు, ఏపీఎం రమణకుమారి, సచివాలయ పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:పారిశుద్య మెరుగుదలకు ప్రజలంతా సహకరించాలని పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, ఆనంద్‌లు తెలిపారు. పారిశుధ్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త బుట్టలను ఆమె గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామస్థులకు రెండు రకాల చెత్త బుట్టలను అందిస్తున్నామని, తడి పొడి చెత్తలను వేరువేరుగా నిల్వ చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ పాల్గొన్నారు.

ఎస్ఐ సొంత నిధులతో గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-కొత్తకోట:తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న దొండపూడి వద్ద రోడ్డుపైన ఏర్పడ్డ భారీ గోతులను కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తన సొంత నిధులతో శనివారం పూడి పించారు. వడ్డాది నుంచి కొత్తకోట వెళ్లే బిఎన్ రోడ్లో దొండపూడి గ్రామం పొడుగునా భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారుల ప్రయాణం చేసే ద్విచక్ర వాహనాల దారులు ఈ గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళలో వర్షం కురిసిన సమయంలో ఈ గోతులు కనబడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్‌తో పలు పర్యాయాలు ఎస్సై సంప్రదింపులు జరిపినప్పటికీ స్పందించలేదు. దీంతో, ఎస్సై సొంత నిధులతో క్వారీ రబ్బీష్ తో గోతులను పూడ్పిపించారు. ఆయనను ఉపసర్పంచ్ జి.రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు అభినందించారు...

గోతులు పూడ్చి వేయిస్తున్న ఎస్ఐ

ఒడ్డుకు చేరిన పడవలు

ప్రజాశక్తి -నక్కపల్లి:తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రెవిన్యూ అధికారులు మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులను అప్రమత్తం చేసారు. తుఫాన్ ప్రభావం కారణంగా వర్షం, ఈదురుగాలులు వీచే ప్రభావం ఉన్నందున వేటకు వెళ్లవద్దని సూచించారు. దీంతో, మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బంగారమ్మ పేట, బోయపాడు, దొండవాక తదితర గ్రామాల్లో మత్స్యకారులు శనివారం వేటకు వెళ్లలేదు. పడవలను సముద్రం ఒడ్డుకు చేర్చారు.

ఎపియుఎస్
రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గొలుగొండ:ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపియుఎస్) రాష్ట్ర కార్యదర్శిగా జోగుంపేట ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎంపి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ఈ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలాజీ, కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎంపి శ్రీనివాసరావుని పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సన్మానిస్తున్న అధికారులు

ఉత్తమ ప్రత్యేక ఉపాధ్యాయులు

మహాలక్ష్మినాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-రావికమతం: దివ్యాంగ విద్యార్థులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడుని రాష్ట్ర సమగ్ర సహిత శిక్ష విద్యా అధికారులు డాక్టర్ వై.నరసింహం, పి. అమ్మినాయుడు, అనకాపల్లి జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారిని శకుంతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు జీవీఎంసీ టౌన్ గర్ల్ హైస్కూల్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సేవలు, సదుపాయాలను మహాలక్ష్మినాయుడు అందిస్తూ మండలంలోని దివ్యాంగుల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. వారికి అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం నుండే కాకుండా దాతల ద్వారా కూడా సమీకరించి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : ఈనెల 5వ తేదీన వడ్డాదిలో జరుగు సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని కేపీ అగ్రహారం గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక సచివాలయంలో గ్రామస్తులు, డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సభ విజయవంతనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవర ముసిలి నాయుడు, సచివాలయం కన్వీనర్ జి.రమణ, సీనియర్ నాయుకులు జి నూకరాజు, స్కూల్ చైర్మన్ పి.గాంధీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొత్తకోట: చోడవరం నియోజకవర్గం పరిధి వడ్డాదిలో ఈ నెల 5న నిర్వహించే బస్ యాత్రను జయప్రదం చేయాలని డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, సర్పంచ్ కొన లోవరాజు కోరారు. శనివారం రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీ ఆవరణలో గ్రామ వార్డు వాలంటీర్, వార్డు సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని, వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీలు పూడి దేవ, కుంచా లక్ష్మి శంకర్, పైల చిన్నమ్మలు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ శివారు పంట పొలాల్లో శనివారం మధ్యాహ్నం కొండ చిలువ కనిపించింది. దీంతో, రైతులు భయాందోళనకు గుర య్యారు. కొంత మంది రైతులు దాన్ని హతమార్చారు. ఈ కొండ చిలువ సుమారు 12 అడుగులు ఉంటుందని పలువురు రైతులు, స్థానికులు పేర్కొన్నారు.

హతమైన కొండచిలువ

న్యాయవాదుల రాస్తారోకో

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో న్యాయ వాదులు శనివారం విధులు బహిష్కరించి రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కుల చట్టాన్ని నిరసిస్తూ న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, భూ హక్కుల చట్టంపై హైకోర్టులో రిట్ పిటిషను వేశామని, బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. ఈ చట్టంతో ప్రజలకు నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.

నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

HDFC ERGO
WANTED AGENTS
NO.1 HEALTH INSURANCE COMPANY
భారతదేశంలోని నెం.1 హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీతో కలిసి పని చేసి గొప్ప అవకాశం
టార్గెట్స్ లేవు
పెట్టుబడి అవసరం లేదు
అపరిమిత ఆదాయం
అనుకూల పనివేళలు
ఎవరైన చేరవచ్చు
గృహిణి, టీచర్లు, బూటీషియన్, లైఫ్/జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ రిటైర్డ్ ఉద్యోగులు, టాక్స్ కన్సల్టెంట్
B.LASKSHMI SUJALA
Health Insurance Expert
Cell : 70 13 61 74 87

నృత్యం చేస్తున్న విద్యార్థులు

పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

చిల్డ్రన్స్ ఫెస్టివల్.. అదరహో..

ప్రజాశక్తి-ఉక్కునగరం

ఉక్కునగరం అంబేద్కర్ కళాక్షేత్రంలోని జ్యోతి బాలవిహార్ ఆవరణలో విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉక్కునగరం చిల్డ్రన్స్ ఫెస్టివల్ 'అదరహో' అనిపించేలా సాగింది. రెండో రోజూ నగరంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వందలాదిగా తరలివచ్చి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. లఘు నాటికలు, జానపద బృంద నృత్యాలు, విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. జానపద గీతాలు ఉర్రూతలూగించాయి. నాటికలు ఆలోచింపచేశాయి. చిట్టిచేతులతో మట్టితో చేసిన బొమ్మలు మెప్పించాయి. సైన్స్ ప్రాజెక్టుల ద్వారా అందరినీ 'ఔరా' అనిపించారు. ముగింపు వేడుకలో విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ డిఎం.రావు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడారు. వేడుకల్లో పాల్గొన్న జడ్జీలకు, వాలంటీర్లుకు నిర్వాహకులు సుశీల, టీనా, మూర్తి, ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విమల, జి.శ్రీనివాసరావు, టి.చిరంజీవి, కె.బాలశౌరి, వెంకట్ కంచిపాటి, త్రిమూర్తులు, ఇంద్రాణి, పద్మజ రాణి, లోకేష్ పాల్గొన్నారు. వాలంటీర్లుగా గుణ, శశి, సాయి, హరిత, సంధ్య, అజయ్, సూర్య కిరణ్ వ్యవహరించారు.

మాట్లాడుతున్న 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, వేదికపై అతిథులు

ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయిలో అధికారులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఈనెల 15 నుండి ప్రారంభి స్తుందన్నారు. సచివాలయ పరిదిలో అధికారులు, నాయకులు క్రీడల పట్ల ఆశక్తి ఉన్న వారిని గుర్తించి, వారిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని సూచించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్ పోటీలు తొలుత సచివాలయ పరిదిలో, తరువాత మండల, నియోజకవర్గ, రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్.భాస్కర్‌నాయుడు, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబబు, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, నర్సీపట్నం ఎంపిపి సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున ఎమ్మెల్యే గణేష్

తుపానుతో ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-కోటవురట్ల: తుఫాన్ హెచ్చరికలతో మండలంలోని వాతావరణంలో మార్పు మొదలు కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మండల వ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పండించిన పంట చేతి కందొచ్చే దశలో తుఫాను హెచ్చరికతో రైతులు దిక్కులు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో పంట కోతలు పూర్తిగానూ, మరికొన్ని ప్రాంతాలలో పక్వానికి రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని మాట్లాడుతూ, కోతలు కోయకుండా నిలిపి వేయాలని రైతులకు సూచించారు.

పండిన వరి పంట